# సినిమా న్యూస్

## టాక్సిక్ టికెట్ రేట్లు పెంపు!

తెలంగాణలో టాక్సిక్ టికెట్ ధరలను పెంచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. యశ్ హీరోగా గీతూ మోహన్ దాస్ డైరెక్షన్లో రూపొందిన ఈ యాక్షన్ థ్రిల్లర్ సినిమా ఆగస్టు 26న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. విడుదలకు ఇంకా ఒక్కరోజే ఉండగా.. ఉదయం సినిమా బుకింగ్స్ ఓపెన్ కాలేదని అభిమానులు ఆందోళన చెందారు. తాజాగా టికెట్ బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. రాష్ట్రంలో సింగిల్ స్క్రీన్స్ లో జీఎస్టీతో కలిపి టికెట్ పై రూ.50, మల్టీప్లెక్సుల్లో రూ.100 పెంచుకునేందుకు అవకాశమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన టికెట్ ధరలు 10 రోజులపాటు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది.




ఈ క్రమంలో ప్రభుత్వం సినిమా ప్రొడ్యూసర్లకు ఒక షరతు విధించింది. నిర్మాణ సంస్థ KVN-మాన్ స్టర్ మైండ్ క్రియేషన్స్ LLP కోటి రూపాయలను తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ కమిటీ ఖాతాకు తప్పనిసరిగా చెల్లించాలని తెలిపింది. ఈ డబ్బును ఇండస్ట్రీలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం కోసం వినియోగించనున్నారు.

## వెయ్యి మాస్ బీట్స్‌కు సమానం

నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం 'ది పారడైజ్'. 'దసర' బ్లాక్ బస్టర్ తర్వాత వీరిద్దరి కాంబోలో రాబోతున్న ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అంతే కాకుండా.. ఈ సినిమా నుంచి వచ్చిన ప్రతి అప్డేట్ ఎంతగానో



ఆకట్టుకోవడంతో పాటు.. 'ఆయా షేర్' అంటూ వచ్చిన ఫస్ట్ సింగిల్ సోషల్ మీడియాలో అత్యధిక వ్యూస్ సొంతం చేసుకుని టాప్ వన్ ట్రెండింగ్‌లో నిలిచింది. ఇదిలా ఉంటే.. తాజాగా ఈ సినిమా నుంచి ఒక అందమైన జర్నీ పిక్చర్‌ను పంచుకున్నారు మేకర్స్. ఈ చిత్రానికి అద్భుతమైన సాహిత్యాన్ని అందిస్తున్న ప్రముఖ లిరిసిస్ట్ కాసర్ల శ్యామ్, మ్యాజికల్ కంపోజర్ అనిరుధ్ రవిచందర్‌ను మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తున్నట్లు కనిపిస్తున్న ఈ ఫొటోను పంచుకుంటూ.. 'ఒక పిక్చర్ వెయ్యి మాటలతో సమానం... కానీ ఈ పిక్చర్ వెయ్యి 'మాస్ బీట్స్'ను తనలో ఇముడ్చుకుంది! ది ప్యారడైజ్ రెండవ సింగిల్ త్వరలోనే రాబోతోంది!.. 24-09-26న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల కాబోతుంది' అంటూ తెలిపారు. కాగా.. ఈ సినిమాలో కయాదు లోహార్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కుల్కర్ణి, సంపూర్ణేష్ బాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎస్ఎల్‌వి సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి గ్రాండ్‌గా నిర్మిస్తున్నారు.

## రవితేజ-శ్రీవిష్ణు కాంబోకు క్రేజీ టైటిల్!



గత నాలుగేళ్లుగా సరైన బాక్సాఫీస్ హిట్ లేక వరుస ఫ్లాపులతో సతమతమవుతున్న మాస్ మహారాజా రవితేజ, ఇటీవల వచ్చిన 'ఇరుముడి' సినిమాతో ఊహించని స్థాయిలో సంచలన బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఈ చిత్రం థియేటర్లలో రికార్డు స్థాయి వసూళ్లు రాబట్టడమే కాకుండా, బాక్సాఫీస్ వద్ద పలు పాత రికార్డులను తిరగరాసింది. ఈ గ్రాండ్ సక్సెస్‌తో రవితేజ మళ్లీ పాత ఫామ్‌లోకి రావడంతో, ఆయన తదుపరి సినిమా ఏ దర్శకుడితో ఉంటుంది? ఏ జోనర్‌లో రాబోతోంది? అనే అంశాలపై సినీ ప్రియుల్లో విపరీతమైన క్యూరియాసిటీ నెలకొంది. తాజా సమాచారం ప్రకారం, రవితేజ తన తదుపరి చిత్రం కోసం ఒక ఆసక్తికరమైన మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కిస్తున్నట్లు తెలుస్తోంది.

యంగ్ అండ్ వర్సటైల్ హీరో శ్రీవిష్ణుతో కలిసి ఆయన ఒక పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రంలో నటించబోతున్నారట. 'వీరాధి వీరులు కేరాఫ్ మహిళా మండలి' అనే డిఫరెంట్ టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమా షూటింగ్‌ను ఆగస్ట్ చివరి వారంలోనే అత్యంత వైభవంగా ప్రారంభించడానికి నిర్మాతలు ప్లాన్ చేస్తున్నట్లు టాక్. మాస్, కామెడీ ఎంటర్టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా థియేటర్లలోకి తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. హాసిత్ గోలి దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ సినిమాను దిల్ రాజ్ నిర్మించనున్నారట. రవితేజ మార్క్ ఎనర్జీ, శ్రీవిష్ణు నటన కలసి వస్తే థియేటర్లలో వినోదాల పంట పండటం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు. ప్రస్తుతం ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.

## నక్షత్రకు మైత్రి బంపర్ ఆఫర్!



మాస్ మహారాజ రవితేజ, దర్శకుడు శివ నిర్వాణ కలయికలో వచ్చిన లేటెస్ట్ చిత్రం 'ఇరుముడి'. ప్రియా భవానీ శంకర్, బేబీ నక్షత్ర, సాయి కుమార్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ మూవీ ఈనెల 21న ప్రేక్షకుల ముందుకు వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ అందుకుని కలెక్షన్లతో బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులను క్రియేట్ చేస్తుంది. చాలా కాలం తర్వాత రవితేజ ఖాతాలో భారీ హిట్ చేరడంతో ఫ్యాన్స్‌తో పాటు చిత్ర బృందం కూడా పండుగ చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే తాజాగా సక్సెస్ మీట్ ఏర్పాటు చెయ్యగా.. బేబీ నక్షత్ర గురించి మాట్లాడుతూ.. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాతలతో ఒకరైన రవిశంకర్ ఈమెకు ఓ బంపర్ ఆఫర్ ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. భవిష్యత్తులో నక్షత్ర హీరోయిన్ అవ్వాలని కోరకుంటూ. ఆమెకు ఆ ఆలోచన ఉంటే.. తనను మా కూతురిగా భావించి, హీరోయిన్‌గా ఇండస్ట్రీకి లాంచ్ చేస్తాం. ఎందుకంటే ఆమె పేరులోనే స్టార్ ఉంది. అంతే అద్భుతంగా నటించింది' అంటూ చెప్పుకొచ్చాడు. ఇక ఇరుముడి చిత్రంలో రవితేజ కూతురుగా బేబి నక్షత్ర పర్ఫార్మెన్స్‌కు విమర్శకుల ప్రశంసలు అందుకుంది. సినిమా బ్లాక్ బస్టర్ అవ్వడానికి నక్షత్ర మెయిన్ పిల్లర్ అనడంలో అతిశయోక్తి లేదు. ఆ రేంజ్‌లో తన యాక్టింగ్‌తో ఆకట్టుకుంది నక్షత్ర.


## 'గాడ్ ఆఫ్ వార్' కోసం కసరత్తులు

భారతీయ పురాణాల్లో విజయానికి, యుద్ధానికి ప్రతీకలా భావించే దైవం కార్తికేయుడు. ఆయన ఇతివృత్తం ఆధారంగా కాల్పనిక అంశాల మేళవింపుతో ఎన్టీఆర్-త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఓ చిత్రం తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు 'గాడ్ ఆఫ్ వార్' అనే పేరు ప్రచారంలో ఉన్నది. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ వర్క్ జరుగుతున్నది. ఇందులో ఎన్టీఆర్ సుబ్రహ్మణ్యస్వామి పాత్రలో కనిపించనున్నారు. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ లుక్ గురించి దర్శకుడు త్రివిక్రమ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారట.



వీఎఫ్ఎక్స్ టీమ్‌తో కలిసి ఎన్టీఆర్ లుక్‌పై వర్క్ చేస్తున్నారని తెలిసింది. మైథలాజికల్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కబోతున్న ఈ పాన్ ఇండియా చిత్రం మేకింగ్‌లో విషయంలో ఎక్కడా పొరపాటు జరగకూడదని, తెరపై ఓ విజువల్ స్పెక్టకిల్‌ను ఆవిష్కరించాలనే సంకల్పంతో త్రివిక్రమ్ ఉన్నారని ఫిల్మ్‌నగర్ టాక్. హారికా అండ్ హాసిని క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకాలపై ఎస్.రాధాకృష్ణ, నందమూరి కల్యాణ్‌రామ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ 'డ్రాగన్' చిత్రాన్ని చేస్తున్నారు. ఇది పూర్తయిన తర్వాతే త్రివిక్రమ్ మైథలాజికల్ మూవీ సెట్స్‌మీదకు వెళ్లనుంది.

## ఊహకు అందని కథతో..




వెర్సటైల్ స్టోరీస్, ఇన్నోవేటివ్ కాన్సెప్ట్స్‌ను తెలుగు ప్రేక్షకులకు అందిస్తూ యంగ్ టాలెంట్‌ను ఎంకరేజ్ చేయాలనే లక్ష్యంతో హీరో కిరణ్ అబ్బవరం కేఏ ప్రొడక్షన్స్ బ్యానర్ స్థాపించారు. ఈ బ్యానర్‌పై ఇటీవల తిమ్మరాజుపల్లి టీవీ సినిమాను నిర్మించి విజయాన్ని అందుకున్న ఈ హీరో.. ఇప్పుడు పౌర్ణమి ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌తో కలిసి మరో ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ అనౌన్స్ చేశారు. ఈ చిత్రాన్ని కిరణ్ అబ్బవరం సమర్పణలో అనూష్ గోరక్ డైరెక్ట్ చేస్తున్నారు. శివశంకర నాయుడు. వై. తో కలిసి కిరణ్ అబ్బవరం నిర్మిస్తున్నారు. ఇందులో కుష్లూ మద్దాల, రెహమాన్, నమ్రిత ఎంవీ, తనూజ పుట్టుస్వామి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా అనౌన్స్‌మెంట్ సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్‌లో పక్షి కాళ్లను చూపిస్తూ, 'ఇలాంటి కథను మీరు ఇప్పటిదాకా తెరపై చూడలేదు, ఇలాంటి జానర్ ను మీరు ఊహించలేదు..'అంటూ రాసిన క్యాప్షన్ ఆసక్తి కలిగిస్తోంది. ఒక కొత్త తరహా కథను స్క్రీన్ మీద ప్రెజెంట్ చేయబోతున్నారు అనే ఇంప్రెషన్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌తో అందరిలో కలుగుతోంది. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.